




ఆయిల్‌పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- జిల్లాలో 27 వేల ఎకరాల్లో సాగు
- రైతులకు సబ్సిడీ ద్వారా మొక్కల అందజేత
- శంకుస్థాపనకే పరిమితమైన ఆయిల్‌పామ్ పరిశ్రమ
- కన్నెపల్లిలో స్థలం పరిశీలించిన అధికారులు

నస్పూర్, జూన్ 22: ఆయిల్‌పామ్ సాగుపై జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. నూనెల తయారీకి ఉపయోగపడే ముడి పదార్థాలను పండించడానికి జిల్లాలోని నేలలు ఉపయోగకరంగా ఉంటాయని భావించి ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జాతీయ నూనె గింజల ఉత్పత్తి మిషన్, ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్‌పామ్ సాగు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో అనువైన నేలలు ఉన్నందున ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 27 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే మంచి లాభాలను ఆర్జించవచ్చని రైతులకు అధికారులు వివరిస్తున్నారు. తక్కువ నీటి సాయంతో ఎక్కువ లాభాన్ని ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో గడిచిన మూడేళ్లలో 804 మంది రైతు లు 2770 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేశారు. ఎకరానికి ఏడాది వయస్సు కలిగిన 57 మొక్కలను రైతులకు ఉద్యానవన శాఖ అందిస్తోంది.

తక్కువ నీరు... అంతర పంటలసాగు

ఎకరం సాగు చేయడంతో రైతుకు ఏడాదికి పెట్టుబడులు మినహాయిస్తే దాదాపు లక్ష రూపాయల వరకు లాభాన్ని ఆర్జించే అవకాశం ఉంటుంది. మొక్కలు నాటిన మొదటి సంవత్సరం నుంచి నాల్గోవ సంవత్సరం పంట దిగుబడి మొదలు అవుతోంది. ఎకరాకు 6 నుంచి 8 టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి వస్తోంది. 10 ఏళ్ళ తరువాత 14 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఆయిల్‌పామ్ సాగు చేసిన తర్వాత అంతర పంటలుగా కూరగాయలను సాగు చేయవచ్చు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందిస్తే నీరు వృథా కాకుండా తక్కువ నీటితో ఆయిల్



ఆయిల్‌పామ్ తోటలో అంతర పంట

పామ్ మొక్కలకు నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ప్రతికూల వాతావరణంలో మొక్కలు తట్టుకుని తెగుళ్ల బారి నుంచి కూడా తట్టుకుంటాయి. మోతాదుగా ఎరువులను వినియోగిస్తే సమృద్ధిగా సమతుల్యమైన పోషక దిగుబడులు వస్తాయి. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే రైతులకు ఎక్కువ దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది. మార్కెటింగ్ విధానం కూడా అధికారులు ఎంపిక చేసిన ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు కోసం రైతులకు రాయితీలను కల్పిస్తోంది. ఆయిల్ పామ్ మొక్కలను తక్కువ ధరలకు సరఫరా జరుగుతుంది. డ్రిప్ ఇరిగేషన్‌కు షెడ్యూల్ కులాలు రైతులకు నూరు శాతం, వెనుక బడిన సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీని అందిస్తోంది.

ఇంకా ఏర్పాటు కాని పరిశ్రమ

జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఇంకా ప్రతిపాదనల్లోనే మిగిలిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం జైపూర్, భీమారంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వివిధ కారణాల వలన మందమర్రి నెలకొల్పాలని నిర్ణయించి శంకుస్థాపనలు కూడా చేశారు. మందమర్రిలో కేటాయించిన స్థలం వివాదం కావడంతో పనులు చేపట్టలేదు. అనంతరం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మందమర్రిలో ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. ఉద్యానవన శాఖ అధికారులు, కంపెనీ ప్రతి నిధులు ఇటీవల కన్నెపల్లి మండలంలో దాదాపు 30 ఎకరాలను పరిశీలించారు. ఎకరాలకు 10 నుంచి 15 లక్షలతో రైతులు నుంచి స్థలం కొనుగోలు చేసి ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో కంపెనీ ఉన్నట్లు తెలుస్తోంది. చెన్నూరు ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టు కింద 2020లో సాగు చేసిన ఆయిల్‌పామ్ దిగుబడి మొదలు కాగా రైతులు నుంచి మార్టిక్స్ సంస్థ కొనుగోళ్లు చేస్తోంది.

యాజమాన్య పద్ధతులు..

ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడి సాధించడానికి పశువుల ఎరువులు, నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వాడితే దిగుబడులు ఆశించిన విధంగా వచ్చే అవకాశం ఉంటుంది. తోటల చుట్టూ గట్టుమీద బోర్డర్ ప్లాంటేషన్ కింద వెదురు పంటలను వేయవచ్చు. ఆయిల్‌పామ్ సాగు చేసిన మూడో సంవత్సరం వరకు అంతర పంటలు మొక్కజొన్న, కూరగాయలు, పత్తి లాంటి పంటలు వేసి లాభాలను పొందవచ్చు. నాలుగేళ్ల దాటిన తర్వాత గెలల దిగుబడి ద్వారా రైతుకు లాభం చేకూరుతోంది. మొక్కలు వరద నీటిని తటుకుంటాయని, కోతులు, అడవి పందుల బెడద ఉండదు.

సాగుపై రైతుల ఆసక్తి

ఉదయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి- మంచిర్యాల



జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. విస్తీర్ణం పెంచడానికి దీని వలన వచ్చే ఆదాయ వనరుల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో మార్కెటింగ్‌కు ఏజెన్సీని ఏర్పాటు చేసి మార్కెటింగ్ వ్యవస్థను ప్రభుత్వం నిర్ణయించింది. 27వేల ఎకరాల వరకు సాగులో ఉంది. ఇంకా దానిని పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

జన్నారం, జూన్ 22 : జన్నారంలోని ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన నిర్వహించారు. పది రోజులపాటు అన్ని గ్రామపంచాయతీల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 330 పనులను పరిశీలించారు. పనుల్లో జరిగిన చిన్న చిన్న తప్పిదాలపై అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు అడిషనల్ డీఆర్‌డీవో దత్తరాం తెలిపారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అంబుడ్స్‌మెన్ శివరాం, ఎంపీడీవో శశికళ, ఎంపీవో రమేష్, ఏపీవో రవీందర్, ఏపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సులను కండీషన్‌లో ఉంచాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్

ఏసీసీ, జూన్ 22: స్కూల్ బస్సులను సరైన కండీషన్‌లో ఉంచాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం కార్మెల్ స్కూల్ బస్సులను తనిఖీలు చేసి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్‌సేఫ్టీ కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఉండాలన్నారు. డ్రైవర్లు యూనిఫాంలు ధరించాలన్నారు. ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ లేకుండా నడిపే బస్సులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా బస్సులు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించవద్దన్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రాజమౌళి

ఏసీసీ, జూన్ 22: శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రాజమౌళిని నియామకం చేస్తూ మల్టీ జోన్ 1 ఐజీ ఏవీ రంగనాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రామగుండం వీఆర్2 ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజమౌళిని శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ గతంలో ఇక్కడ వెంకటేశ్వర్‌రావుకు ఇచ్చిన పోస్టింగ్‌ను రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధ్యాపకులు

బెల్లంపల్లి, జూన్ 22 : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలీసెట్ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి అన్నారు. మొదటి రోజు కౌన్సెలింగ్‌కు 323 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని, కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 25 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



చరణ్‌తేజ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు, ఏసీపీ

బెల్లంపల్లి, జూన్ 22: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించిన బెల్లంపల్లికి చెందిన విద్యార్థి దుర్గం చరణ్‌తేజ్‌కు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు శనివారం రూ.17,500 ఆర్థిక సహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థి చరణ్‌తేజ్ ఫీజు కట్టలేని స్థితిలో ఉన్నాడని, ఫీజు చెల్లించాల్సి ఉందని ప్రిన్సిపాల్ సైదులు తన దృష్టికి తీసుకురావడంతో సహాయం అందించినట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ఎన్ఎస్‌యూఐ అండగా ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ సైదులు, వైస్‌ప్రిన్సిపాల్, నాయకులు శివ, వంశీ, బాలకృష్ణ పాల్గొన్నారు.

చరణ్‌తేజ్‌కు ఏసీపీ రవికుమార్ రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఏసీపీ మాట్లాడుతూ చరణ్‌తేజ్ కష్టపడి చదివి ఐఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ సైదులు,పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు తిరుపతిలను ఏసీపీ అభినందించారు. దాగం తిరుపతి, శ్రీరామవర్మ, రమేష్, లక్ష్మీనారాయణ, రవీందర్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఊరు పోచమ్మ కొలుపు

చెన్నూరు, జూన్ 22: మండలంలోని ఎర్రగుంటపల్లిలో శనివారం ఊరి పోచమ్మ కొలుపు ప్రారంభించారు. ఆదివారం మధ్యాహ్నం వరకు కొలుపు ఉంటుందని, రచ్చపల్లి, కొమ్మెర, ముత్తరావుపల్లి, నర్సక్కపేట, పొక్కూరు, బీరెల్లి గ్రామాల రాకపోకలకు అంతరాయం ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఇతర గ్రామాల ప్రజలు అంగ్రాజ్‌పల్లి గ్రామం మీదుగా వెళ్లాలని సూచించారు.

కలుషిత ఆహారం విక్రయిస్తే చర్యలు

జన్నారం, జూన్ 22 :కలుషిత ఆహారం విక్రయిస్తే చర్యలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ కలర్ వేసి ఉన్న ఆహారాన్ని చెత్త కుప్పలో వేయించారు. ఆహారం నిల్వ ఉంచి విక్రయించినా, ఫుడ్ కలర్ వేసి వండితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది షకీల్ ఉన్నారు.

కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

ఏసీసీ, జూన్ 22 : జిల్లా ప్రధాన జడ్జి బోయ శ్రీనివాసులు కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కోర్టు హాలులో శనివారం నిర్వహించారు. క్రిమినల్ కేసుల పురోగతి, పరిష్కారం, 5 సంవత్సరాల పైబడిన కేసుల పై కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులతో చర్చించారు. క్రిమినల్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంటు కేసులు, జైలులో ఉన్న ఖైదీల కేసుల పరిష్కారం, పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి, ఏసీపీ ప్రకాష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నందగోపాల్, లక్సెట్టిపేట సబ్ జైల్ సూపరింటెండెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసం పనిచేస్తున్న మోదీ ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జూన్ 22: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పదేళ్ళుగా కార్పొరేట్‌లకు దేశ సంపదను దోచి పెడుతోందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేండ్లలో మోదీ 10 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి 7 కోట్ల ఉద్యోగాలను ఊడగొట్టాడన్నారు. సింగరేణి, బీహెచ్‌ఈఎల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కంపెనీకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేయడమే ఎజెండాగా మోదీ ప్రభుత్వం పనిచేస్తే ఇందుకు గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు పలికిందన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరిట ఎన్‌హెచ్ 63 భాగంగా లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో రైతుల భూములను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులు మళ్లీ భూములు కోల్పోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకునిపై దాడికి తనకు సంబంధం లేదన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసి మంచిర్యాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తరుగు పేరిట దోపిడీ లేకుండా కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని సీఎం ప్రకటించడం గొప్ప విషయమన్నారు. తూముల నరేష్, పూదరి తిరుపతి, హేమలత, వసుంధర, రైతులు పాల్గొన్నారు.

పేద మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఏసీసీ, జూన్ 22: పేద మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో 154 మంది లబ్ధిదారులకు రూ. 1,54,17,864 విలువ గల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు, నల్ల శంకర్, హరికృష్ణ, బానేష్, మిన్‌హాజ్, వసుంధర, మహేశ్వరి, రజిత, కిషన్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పంపిణీ చేశారు. 68 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ళ వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, కుమార్, వంగ తిరుపతి, సంధ్యారాణి, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల కోసం పచ్చిక మైదానాలు



గడ్డి జాతి గింజలను చల్లుతున్న ప్లాంటేషన్‌ల మేనేజర్లు

చెన్నూర్, జూన్ 22: అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల కోసం గడ్డి జాతులను విస్తరించడానికి పచ్చిక మైదానాలను ఏర్పాటు చేస్తున్నామని అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమి, ప్రపంచ రైన్ ఫారెస్టు డేను పురస్కరించుకుని అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటపల్లి మండలం బావనపల్లి నీలగిరి ప్లాంటేషన్‌ల మధ్యలో గడ్డి జాతి గింజలను చల్లారు. ఆమె మాట్లాడుతూ పచ్చిక కొరవడడంతో కుందేళ్లు, జింకలు అంతరిస్తున్నాయన్నారు. అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా పచ్చిక మైదానాలను పెంచాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రేంజ్‌ల ప్లాంటేషన్‌ల మేనేజర్లు సురేష్‌కుమార్, లక్ష్మణ్, సునీత, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్‌లు రాకేష్, నరేష్, డిప్యూటీ రేంజ్ అధికారి రూప్సీలక్ష్మీ, ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, రాజేష్, వాచర్‌లు పాల్గొన్నారు.

గూడెం ఆలయంలో రద్దీ

దండేపల్లి, జూన్ 22: ఎరువాక పౌర్ణమి పురష్కరించుకొని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ సమీపంలోని గోదవరి నదిలో స్నానం ఆచరించి గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా ప్రధానాలయంలో స్వామికి అభిషేక పూజలను నిర్వహించారు కుటుంబ సమేతంగా స్వామి వారి సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం నిర్వహించినట్లు ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గూడెం పరిసర ప్రాంతమంతా భక్తులతో సందడి నెలకొంది.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

స్పీడ్‌బ్రేకర్ ఏర్పాట్లపై పరిశీలన

కాగజ్‌నగర్, జూన్ 22: కాగజ్‌నగర్ ప్రధాన కూడళ్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు శనివారం కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ దస్తగీర్, కౌన్సిలర్లు, ఎస్పీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతిచెందిన జర్నలిస్టు పిల్లలకు ప్రతినెల రూ.వెయ్యి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 22: జర్నలిస్టుల సంక్షేమనిధుల నుంచి మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రతినెల రూ.1000చొప్పున అందించడానికి మీడియాఅకాడమీ నిర్ణయించినట్లు జిల్లా డీపీఆర్‌వో సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం డీపీఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టు పిల్లలు ఎవరైనా ఉంటే డీపీఆర్‌వో కార్యాలయంలో బోనఫైడ్ సర్టిఫికేట్ అందించాలన్నారు.

కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

కాగజ్‌నగర్, జూన్ 22: కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం శనివారం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడుగా అంగల తిరుపతి, ఎండీ ఇసాక్, గంధం శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా జంబుల మధుకర్, శ్రీనివాస్, అధ్యక్షులుగా టి సురేందర్‌రావు, ప్రధానకార్యదర్శిగా తిరుమలాచారి, కోశాధికారిగా షఫీఉల్లా, ఉపాధ్యక్షులుగా అనంతుల సురేష్, దుస్స మహేష్, ఈర్ల సతీష్ కుమార్, జమీల్ అహ్మద్ తదితరులను ఎన్నుకున్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

జన్నారం, జూన్ 22 : అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సీతామహాలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జన్నారంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం టీచర్లకు లక్ష, ఆయాలకు రూ.50వేలు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని జీవోనెంబర్10ని విడుదల చేసిందన్నారు. ఈ జీవోను రద్దు చేసి టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. వేతనాలు పెంచాలని, పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించా లని ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సరస్వతి, శైలజ, లక్ష్మీ,పద్మ, కృప, రాజవ్వ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల బైండోవర్

వేమనపల్లి, జూన్ 22 : దస్నాపూర్ తాటి వనంలో ఈ నెల 19న పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పేకాట స్థావరం చేయగా 15 మంది పారిపోయారని, వారిని శనివారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యాంపటేల్ తెలిపారు. మళ్లీ పేకాట ఆడుతుండగా తహసీల్దార్ రమేష్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకుపాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

జన్నారం, జూన్ 22 :మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన భాస్కర్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రాజవర్ధన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితునికి శనివారం సెల్‌ఫోన్‌ను అందజేశారు. పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

వేమనపల్లి, జూన్ 22: బుయ్యారం గ్రామ అటవీప్రాంతంలో శనివారం గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, పోలీసులు దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ శ్యాంపటేల్ తెలిపారు. గుడుంబా తయారు చేసినా విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ అధికారులపై తిరగబడ్డ నెమలికొండ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ సమ్మయ్య, ఎస్‌ఐ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 22: కాసిపేట గని టీబీజీకెఎస్ నాయకులు బెల్లం అశోక్ సోషల్ మీడియాలో ఎంపీ గడ్డం వంశీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. గడ్డం వంశీని ఉద్దేశించి మీ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు ఉంటే చాలా అని పోస్టులు పెట్టాడని ఈ విష యంపై బెల్లంపల్లికి చెందిన బలరాం అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారం చోరీ చేసిన నిందితుడి అరెస్టు

ఏసీసీ, జూన్ 22: బంగారం చోరీ కేసులో పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ వివరాలను వెల్లడించారు. బీహార్‌కు చెందిన వినయ్‌కుమార్ సిన్హా మంచిర్యాల పట్టణంలో ఉంటున్నాడు. మే 8న అతడి తండ్రి మరణించడంతో ఇంట్లో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలను సూట్‌కేసులో పెట్టి ఇంటి పక్కన ఉన్న శంకర్‌సింగ్ ఇచ్చాడు. బీహార్ నుంచి తిరిగి వచ్చిన వినయ్‌కుమార్ ఈ నెల 20న శంకర్ సింగ్ ఇంట్లో పెట్టిన సూట్‌కేసును తెరిచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ముఖరాం చౌరస్తా వద్ద చంద్రశేఖర్ సిన్హా అనే అతడు బంగారు ఆభరణాలతో పట్టుబడ్డాడు. పాలిటెక్నిక్ చదువుతూ ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం వ్యసనంగా మారగా డబ్బులు లేకపోవడంతో మేన మామ శంకర్‌సింగ్ ఇంట్లో ఉన్న వినయ్‌కుమార్ సిన్హా సూట్ కేసు తెరిచి రూ.7 లక్షల విలువైన 10 తులాల బంగారు ఆభరణలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. నింది తున్ని అరెస్టు చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, ఎస్ఐ ప్రశాంత్ పాల్గొన్నారు.

మంచిర్యాలలో నాకాబందీ

ఏసీసీ, జూన్ 22 : మంచిర్యాలలో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు, డ్రైవింగ్, ఇన్సూరెన్స్, నెంబరు ప్లేట్‌లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాల పత్రాలు కలిగి ఉండాలని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. తనిఖీల్లో పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మందమర్రి, చెన్నూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్సెట్టిపేటరూరల్, జూన్ 22 : రైతు రుణమాఫీ ప్రకటనపై లక్సెట్టిపేటలో శనివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. గాంధీ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్, పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగళి రమేష్, ఎంపీపీ చిన్నన్నమంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్, విజయ్, రాజన్న, లింగన్న, రాజు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్ పోగుల సతీష్, నాయకులు బాపురెడ్డి, చీర్ల సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జైపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తానని ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏకకాలంలో ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: రైతు రుణమాఫీ ప్రకటించడంపై ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, నోముల ఉపేందర్‌గౌడ్, మహంత్ అర్జున్‌కుమార్‌లు మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.



లక్సెట్టిపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్ష్మణ్, ఇసాక్, జావేద్, నర్సోజీ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: ఏకకాలంలో రైతు రుణమాఫీ రూ.2 లక్షలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నరేష్, ఆవిడపు రవి, బానేష్, సమ్మయ్య, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: రైతు రుణమాఫీ ప్రకటనపై చిర్రకుంట గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, మాజీ సర్పంచు కొమురయ్య, రాజయ్య, బాలయ్య, సుధాకర్, మహేందర్ పాల్గొన్నారు.

దండేపల్లి: రైతు రుణమాఫీ ప్రకటనపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా కృషి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 22: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా మహిళ శక్తి ద్వారా కృషి చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో కిషన్‌లతో కలిసి అధికారులు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, సీడీపీవోలతో మహిళ శక్తి పథకంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి పథకం ద్వారా అనేక అవకాశాలు కల్పిస్తుందన్నారు. మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లో భాగంగా 5684 మందికి రూ.64.73 కోట్లు, స్టిచ్చింగ్ సెంటర్‌లో 618 మందికి రూ.2.35 కోట్లు, పాడి పశువుల విభాగంలో 500 మందికి రూ.4.50 కోట్లు, బ్యాక్‌యార్డు పౌల్ట్రీ విభాగంలో 2 వేల మందికి రూ.3 కోట్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్ల విభాగంలో 16 మందికి రూ.46 లక్షలు, మీసేవ విభాగంలో 20 మందికి రూ.50 లక్షలు, ఈవెంట్ మేనెజ్‌మెంట్ విభాగంలో 21 మందికి రూ.31 లక్షలు, మిల్క్ పార్లర్ల విభాగంలో ఒక్కొక్కరికి రూ.1.90 లక్షలు, ఫుడ్ ప్రాసిసెంగ్ యూనిట్ల విభాగంలో 200 మందికి రూ.4 కోట్లు కార్యాచరణ రూపొందించామన్నారు. నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి కమిషనర్ గంగాధర్‌తో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూరు మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. మురికి కాలు వలను శుభ్రం చేయాలని, డ్రైడే కార్యక్రమాలు నిర్వ హించాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీ లించి అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. తహసీ ల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులు, ధరణి పోర్టల్ నిర్వహణను పరిశీలించారు. వంద పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సాయికిరణ్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఏసీసీ, జూన్ 22: కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. శనివారం ఓ ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. యూనిఫాంలు, పుస్తకాలు, షూ, టైలు విక్రయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నాయన్నారు. చిప్పకుర్తి శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్, ఆదర్శ్‌వర్ధన్, ప్రవీణ్, రాథోడ్, శ్రావణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సంఘాలకు రాజీనామాలు

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 22: కాసిపేట మండలంలోని ఎస్‌జీటీలు ఉపాధ్యాయ సంఘాల పదవులకు శనివారం రాజీనామాలు చేశారు. ఎస్‌జీటీలు మాట్లాడుతూ ఎస్ఏ తెలుగు, హిందీ, పీడీ ప్రమోషన్‌లలో కామన్ సినియారిటీ పాటించాలని, 10 వేల హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్‌ను రద్దు చేయాలని, ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

కన్నెపల్లి, జూన్ 22 : మండలంలోని జజ్జరవెల్లిలో ప్రజలకు శనివారం ఎస్ఐ గంగారాం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఏటీఎం నెంబర్, ఓటీపీ నెంబర్లు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, ఫోన్‌పే కేవైసీలు అప్‌డేట్ చేయమని వచ్చేమెసెజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపించినా, ఏదైనా సమస్య ఉన్నా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరులోని మున్సి హైస్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై ఎస్ఐ శ్వేత అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. చిన్న చిన్న విషయాలకు కృంగిపోయి బాధపడి ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. విద్యార్థినీలను వేధిస్తే షీటీంలకు కానీ డయల్ 100కు కానీ సమాచారం అందించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చెన్నూరు, జూన్ 22 : పట్టణంలో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. అంబేద్కర్ చౌక్ నుంచి పెద్ద చెరువు వరకు రోడ్డుపై నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 5 కార్లు, 30 ద్విచక్రవాహనాలకు జరిమానాలు విధించినట్లు సీఐ తెలిపారు. రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్వేత, వెంకటేశ్వర్, పోలీసులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసమే షీటీంలు



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

బెల్లంపల్లి(తాండూర్) జూన్ 22: మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే షీటీంలు ఉన్నాయని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. శనివారం కమ్యూనిటీ పోలీసు కార్యక్రమంలో భాగంగా తాండూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో షీటీం, డయల్ 100, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే షీటీంలకు, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ నెంబర్లు చెప్పవద్దన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు.

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సంతోష్ అన్నారు. సైబర్ నేరాలు, షీటీం, మహి ళల రక్షణ, తదితర అంశాలపై కేరళ మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య ఉంటే 100కు డయల్ చేసి రక్షణ పొందాలని సూచించారు. లైంగికంగా వేధిస్తే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కొత్తవారిని గుడ్డిగా నమ్మవద్దన్నారు. సామాజిక దురాచాల నివారణ, గ్రామీణ వాతావరణం, కుటుంబ అనుబంధాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై, సైబర్ క్రైమ్ నెంబర్ డయల్ నెంబర్ 1930 అవగాహన కల్పించారు.

యువత చెడు అలవాట్లకు బానిస కావద్దు

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 22 : యువత చెడు అలవాట్లకు బానిస కావద్దని దే వాపూర్ ఎస్ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి సాలెగూడలో ప్రజలతో పోలీసులు నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

దహెగాంలో దారుణం

- రెండు నెలల క్రితం వ్యక్తి హత్య
- కేసును చేధించిన పోలీసులు



సాయికిరణ్(ఫైల్)

దహెగాం, జూన్ 22: కరీంనగర్ జిల్లా మానకొండూరులో వ్యక్తి అదృశ్యమై దహెగాం మండలకేంద్రంలో దారుణంగా హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్, దహెగాం ఎస్సై రాజు హత్య వివరాలు శనివారం వెల్లడించారు. మానకొండూరు గ్రామానికి చెందిన అనంతోజు సాయికిరణ్(29) ఏప్రిల్18, 2024న భార్య అనుషతో సిద్దిపేటకు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లిన తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మే 2న మానకొండూరు పోలీసుస్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఓ కోళ్ల ఫాంలో అనంతోజు సాయికిరణ్ పనిచేస్తుండగా, దహెగాంకు చెందిన బట్టి సునీత, ఆమె భర్త శ్రీనివాస్ పరిచయమయ్యారు. సునీత, సాయికిరణ్‌తో సాన్నిహిత్యంగా ఉండడంతో ఇరు కుటుంబంలో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ భార్య అనూషతో కలిసి మానకొండూరుకు వచ్చి కమ్రమిషన్‌లో పని చేస్తున్నాడు.

మళ్లీ ఏప్రిల్18, 2024న సాయి కిరణ్ కోళ్లఫాంకు వెళ్లగా సునీత, శ్రీనివాస్ దంపతులతో గొడవజరిగింది. దీంతో సునీత, శ్రీనివాస్‌లు అదేరోజు దహెగాంకు వెళ్లారు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ ఏప్రిల్ 19, 2024న దహెగాంలోని సునీత, శ్రీనివాస్ ఇంటికి వచ్చాడు. అదేరోజు రాత్రి సునీత కుటుంబసభ్యులు తండ్రి తుమ్మిడిగంగారాం, మేనమామ భీంకరి శ్యాంరావుతోపాటు సునీత, శ్రీనివాస్ కర్రలతో సాయి కిరణ్‌పై దాడిచేసి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దహెగాంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని పాడుబడ్డ బావిలో పడవేశారు.

మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ విచారణలో భాగంగా సునీత, శ్రీనివాస్‌ను విచారించగా హత్య విషయాన్ని అంగీకరించారు. దీంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటికితీసి పంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 22: బొగ్గుబ్లాక్‌లను సింగరేణికే కేటా యించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో సీఐటీయూ నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థను దివాళా తీయించే విధంగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లను వేలం పాట ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఈ ప్రక్రియ ప్రారంభించడం ఆందోళనకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యకమన్నారు. కార్యక్రమంలో నాయకులు టికానంద్, కార్తీక్, నిఖిల్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూన్ 22: జిల్లాలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 7.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జైనూరుమండలంలో 7.6,సిర్పూర్(యూ)లో 3, లింగాపూర్‌లో21.4, తిర్యాణిలో 6.8, రెబ్బెనలో 4.2, ఆసిఫాబాద్‌లో 8.2, కెరమెరిలో 4.2,వాంకిడిలో 3, కాగజ్‌నగర్‌లో 15.4, సిర్పూర్(టి)లో3, కౌటాలలో0.6, చింతలమానేపల్లిలో1.6, పెంచికలపేటలో20.2, దహెగాంలో 16.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

సిర్పూర్(యు): మండలంలో వివిధ గ్రామాల్లో శనివారం వర్షం కురిసింది. ఈ వర్షం మొలకదశలో ఉన్న పంటలకు జీవం పోసినట్లు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సిర్పూర్(యు)లో కురుస్తున్న వర్షం

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 22: మహిళల భద్రతే షీటీం లక్ష్యమని షీటీం ఇన్‌చార్జీ సునీత అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నలంద, ఏఎస్సై ఫసివుద్దీన్, కానిస్టేబుల్ సునీత, స్వప్న,శ్రీలత పాల్గొన్నారు.



అవగాహన కల్పిసుతన్న షీ టీం ఇన్‌చార్జి సునీత

ఘనంగా శ్రీదేవల మహర్షి జయంతి

బెజ్జూరు, జూన్ 22: మండల కేంద్రంలో శనివారం దేవాంగ సంఘం ఆధ్వర్యంలో వస్త్రప్రదాత, దేవాంగ కులగురువు శ్రీదేవల మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరంస్వీట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బెనికి శ్యాంసుందర్, అధ్యక్షుడు శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

25న కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు

ఆసిఫాబాద్, జూన్ 22: జిల్లాలోని పెంచికలపేట మండలకేంద్రంలోని రైతు వేదికలో ఈనెల25న కొబ్బరిసాగుపై అవగాహన నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఉద్యానవన అధికారి సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కొబ్బరి అభివృద్ధిసంస్థ, ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో హాజరై కొబ్బరి సాగుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ

ఆసిఫాబాద్, జూన్ 22: బడిబాటలో భాగంగా మండలంలోని బాబాపూర్, రౌటసంకెపల్లి ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులకు ఎంపీపీ మల్లికార్జున్ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, సావిత్రి, ఎంఈవో మనుకుమార్, నాయకులు రాజన్న, కిషన్, బిజ్జు పాల్గొన్నారు.

సేవాలాల్‌సేన జిల్లా కన్వీనర్‌గా బదావత్ శివప్రసాద్

ఆసిఫాబాద్, జూన్ 22: సేవాలాల్‌సేన జిల్లా కన్వీనర్‌గా బదావత్ శివప్రసాద్‌ను నియమించారు. శుక్రవారం హైదరాబాద్ పట్టణంలోని సుందరయ్యభవన్‌లో జరిగినసమావేశంలో సేవాలాల్‌సేన వ్యవస్థాపకఅధ్యక్షుడు సంజీవ్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లాకన్వీనర్‌గా శివప్రసాద్‌ను నియమించి నియామకపత్రాన్ని అందజేశారు.

చలో ఐటీడీఏను విజయవంతం చేయండి

తిర్యాణి, జూన్ 22: ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని ఈనెల24న తలపెట్టిన చలో ఐటీడీఏ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లాకార్యదర్శి భగవంతురావు, శ్రీరాం,ధర్ము కోరారు. జీవోనెం.3రద్దు, పీసా యాక్టు అమలు, 1/70జీవో పునరుద్దరణ తదితరఅంశాలపై చలో ఐటీడీఏ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు

తిర్యాణి, జూన్ 22: మండలకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వెండిచీరను అలంకరించారు. ఆలయ19వ వార్షికోత్సవంను పురస్కరించుకుని ప్రత్యేకపూజలు, అన్నదానం నిర్వహించారు.

ఘనంగా రావి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

బెజ్జూరు/సిర్పూర్(టి)/కాగజ్‌నగర్, జూన్ 22: బెజ్జూరు, సిర్పూర్(టి) మండలకేంద్రాల్లో, కాగజ్‌నగర్‌లో శనివారం సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బెజ్జూరులో జరిగిన కార్యక్రమంలో నాయకులు హకీం, నరేందర్, జావీద్, మహేష్, బాపు రావు, విష్ణుమూర్తి, సిర్పూర్(టి)లో తిరుపతి, శంకర్, ఇప్పద్‌హుస్సేన్, శంకర్, రమేష్‌గౌడ్, కాగజ్‌నగర్‌లో ఎమ్మాజీ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులో మోగిన సైరన్

పెంచికలపేట, జూన్ 22: మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శనివారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఎమర్జెన్సీ సైరన్ మోగడంతో స్థానిక కాలనీవాసులు 100నెంబరు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బ్యాంకు వద్దకు వచ్చి బ్యాంకు మేనేజర్ ఫోన్ చేసి పిలిపించారు. బ్యాంకు తాళాలు తీసి గదుల లోపల పరిశీలించారు. ఈ విషయమై మేనేజర్ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా ఎలాంటి దొంగతనం జరగలేదని సాంకేతిక కారణాలతో సైరన్ మోగిందని తెలిపారు.

ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

కాగజ్‌నగర్, జూన్ 22: ఎస్పీఎంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు రాజేశంకు శనివారం గాయాలయ్యాయి. విధులు నిర్వహిస్తున్న క్రమంలో మిషన్ భాగం చేయిపై పడింది. వెంటనే కార్మికులు స్పందించి చికిత్స కోసం అతన్ని ఆసుపత్రికి తరలించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

జైనూర్, జూన్ 22:మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ కుమ్రతిరుమల విశ్వనాథ్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులు తమ తమశాఖద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సభకు వివరించారు. ఆయాశాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమపథకాలు అర్హులకు అందేలాచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి అటవీ,ఆర్టీసీ,ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, మార్కెటింగ్‌శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలక్ష్మణ్, ఇంచార్జి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బీర్షా అధికారులు పాల్గొన్నారు.



సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్, జూన్ 22: బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ లాంగ్‌టర్మ్(ప్రిలిమ్స్‌మెయిన్స్) పరీక్షలకు ఉచితశిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లావెనకబడిన తరగతుల అభివృద్ధిఅధికారి సత్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలపారు. ఈనెల19నుంచి జూలై3వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై18నుంచి తరగతులు ప్రారంభమై వచ్చే ఏడాది ఏప్రిల్18వరకు కొనసాగుతాయన్నారు. మొత్తం150మందికి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు ఎంపికైనవారికి వసతి,భోజన,రవాణాసదుపాయం కోసం నెలకు 5వేలు, బుక్‌ఫండ్‌నిమిత్తం మరో5వేల రూపాయలు ఇస్తామన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



వాంకిడిలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 22: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ అన్నారు. శనివారం సాంఘిక సంక్షేమబాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం లేని సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి అనంతలక్ష్మి, లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు, అంజనాదేవి, ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉన్నతవిద్యను అభ్యసించాలని ఆసిఫాబాద్ సీనియర్ సివిల్‌జడ్జి యువరాజ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బెండారగ్రామంలోని ఆదర్శప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్య వ్యతిరేకదినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు గంజాయి కేసుల్లో అరెస్టు అయితే భవిష్యత్ నాశనం అవుతుంద న్నారు. విద్యార్థులు కళాశాలల్లో ర్యాగింగ్ చేయకుండా తల్లిదండ్రు లను, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయివాడకం ఎక్కువగా ఉందని వీటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ కౌన్సిల్ అంజనాదేవి, ఎస్సై సాగర్, ప్రిన్సిపాల్ కనకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరప్రవృత్తిని వీడి మంచి పౌరులుగా ఎదగాలి

ఆసిఫాబాద్‌రూరల్: సమాజంలో ప్రతిపౌరుడు నేరప్రవృత్తిని విడనాడి మంచి పౌరులుగా ఎదగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్‌జడ్జి కె యువరాజ అన్నారు. జిల్లాకేంద్రంలోని స్పెషల్ సబ్‌జైలును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావే శంలో చేసే నేరాలకు కుటుంబం మొత్తం ఇబ్బంది పాలుకావడంతో పాటు సమాజంలో చెడు గుర్తింపు మిగులుతోందన్నారు. ప్రతి ఒక్కరు ఆవేశ పూరితంగా కాకుండా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఖైదీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని పెట్టుకోలేని ఖైదీలకు డిస్ట్రిక్ లీగల్‌సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయాన్ని కోరిన వారికి అందించనున్నట్లు తెలిపారు. ఖైదీల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆయనవెంట జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్, సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


వెంకటేష్ (ఫైల్)

సిర్పూర్(టి), జూన్ 22: మండలకేంద్రంలోని సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధానరహదారిపై శనివారం తెల్లవారుజామున కొడిప్యాక వెంకటేష్(34) వ్యాన్ కింద రక్తపుమడుగులో మృతిచెంది ఉన్నాడు. ఎస్సై దీకొండ రమేష్, మృతుడి సోదరులు మల్లేష్ తెలిపిన వివరాలప్రకారం.. సిర్వోంచలోని కోటపోచం పల్లికి చెందిన వెంకటేష్ ఫర్నీచర్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి వ్యాన్‌లో కర్ర తీసుకుని సిర్వోంచకు వెళ్తుండగా వ్యాన్‌డ్రైవర్‌కు నిద్ర రాగా పెద్దబండ రైస్‌మిల్లు సమీపంలో వ్యాన్‌ను నిలిపి నిద్రిస్తున్నారు. ఇంతలో పెట్రోలింగ్‌కు వెళ్లే పోలీసులు రక్తపుమడుగులో పడిఉన్న వెంకటేష్‌ను గుర్తించి వ్యాన్‌లో ఉన్న డ్రైవర్‌తోపాటు మరోవ్యక్తిని లేపి విచారించారు. వారి నుంచి సరైన సమాచారం లభించకపోవడంతో మృతిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూన్ 22: షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీఎస్టీ, బీసీ(బీసీ-ఈ) తో పాటు దివ్యాంగులైన అభ్యర్థులు ఈనెల 17నుంచి జూలై 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వందమంది అభ్య ర్థుల ఎంపిక కొరకు జూలై21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు పదినెలల రెసిడెన్షియల్ ఉచితకోచింగ్ ఉంటుందన్నారు.

సామాన్యుడికి అందని కూరగాయలు

- చుక్కలనంటిన ధరలు
- మిర్చి ఘాటు.. టమాట పులుపు..
- వారం, పది రోజుల్లోనే రెట్టింపు
- వర్షాలు లేక దెబ్బతిన్న పంటలు
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరాతో మరింత భారం
- కొనలేని స్థితిలో సామాన్య ప్రజలు

కూరగాయల మార్కెట్ అంటేనే సామాన్యుడు జేబును తడుముకుంటున్నాడు... డబ్బులు సరిపోతాయా అని. వారం పదిరోజులుగా కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కిలో రూ.100కు తక్కువగా ఏ కూరగాయ లభించడం లేదు. దీంతో పావు కిలో, అర్ధపావు చొప్పున కొనుగోలు చేసి మిక్స్ చేసి వండుకుని సంతృప్తి చెందుతున్నారు. అదికూడా సరిపోని పక్షంలో చింతపండు రసంతో చారు కాచుకుని సరిపుచ్చుకుంటున్నారు. ఇదీ ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలతో సామాన్యుడి ఇంట్లో భోజనం తీరు.


బెజ్జూరులోని కూరగాయల మార్కెట్

బెజ్జూరు, జూన్ 22: కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండగా కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు, పేద ప్రజలు విలవిలలాడుతున్నారు. ధరలు ఇలా ఉంటే కొనేదెలా? తినేదెలా? అంటూ బెంబేలెత్తిపోతున్నారు. వారం, పది రోజుల్లోనే మార్కెట్‌లో కూరగాయల ధరలు రెట్టింపవడంతో మార్కెట్‌కు రూ.500నోటు తీసుకెళితే కనీసం వారం రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సామాన్యులకు నిత్యం అందు బాటులో ఉండే టమాట కిలో రూ.80 పలుకుతోంది. నిన్న మొన్నటి వరకు రూ.40వరకు లభించిన టమాట ఇప్పుడు డబుల్ కావడంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మృగశిర కార్తె ప్రవేశించి వర్షాకాలం ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవకపోవడం, ఎండ తీవ్రత తగ్గకపోవడం లాంటి కారణాలతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరోవైపు గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు సాగుచేసేవారి సంఖ్య తగ్గడం, ఒకవేళ సాగు చేసినా దిగుబడి తగ్గిపోతుండటం కూడా కారణమవుతోంది. ఎప్పుడూ స్థానికంగా దొరికే కొత్తిమీర గతంలో కట్టకు రూ.50ఉంటే, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీర ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ఆకు కూరలు మాత్రమే స్థానికంగా పండిస్తున్నారు. ఇతర కూరగాయల ధరలు కూడా రూ.100కు తక్కువగా లేవు. ప్రతీ రోజు కూరగాయలకే రూ.100ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితేంటని దినసరి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దూరప్రాంతాల నుంచి సరఫరా..

జిల్లాలో అత్యధికంగా రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతుండటంతో కూరగాయల సాగు అమాంతం తగ్గిపోయింది. జిల్లాలో ఈస్‌గాం, బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్ తది తర మండలాల్లోనే కూరగాయల సాగు చేస్తున్నారు. ఇక ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి తదితర ప్రాంతాల్లో కూరగాయల సాగు చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో పంటసాగుకు మొగ్గుచూపినా వాతావరణం అనుకూలించక పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో ధరలకు ఒక్క సారిగా రెక్కలొచ్చాయి. డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడంతో వాటి ధరలు మండుతున్నాయి. ప్రతిఏటా వర్షాకాలం తొలిసీజన్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు కలిసి కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

ధరలు ఇలా..

ప్రస్తుతం మార్కెట్‌లో అల్లం నుంచి కొత్తిమీర వరకు అన్నిధరలు పెరగడం సామాన్యులకు కొనకముందే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ప్రస్తుతం టమాట కిలోకు ధర రూ.80, బీరకాయ రూ.100, కాకరకాయ రూ.100, దోసకాయ రూ.100, దొండకాయ రూ.80, గోరుచిక్కుడు రూ.80, మిర్చి రూ.120, చిక్కుడుకాయ రూ.100, క్యారెట్ రూ.100, క్యాబేజి రూ.100, కొత్తిమీర రూ.200, పుదీన రూ.120, అలిచంద రూ.80, బెండకాయ రూ.80పలుకుతుండటంతో సామాన్యులు కొనలేక ఆందోళన చెందుతున్నారు. వారం, పది రోజుల్లోనే ధరలు ఆకాశానికి చేరుకోవడంతో ప్రజలు ఏం కొనాలో తెలియక అవస్థలు పడుతున్నారు. మరో నెల రోజుల వరకు ధరలు ఇలాగే ఉండే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు తెలుపుతున్నారు. ధరలు అధికంగా ఉండటంతో వ్యాపారాలు కూడా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు.

● కొనే పరిస్థితి లేదు..: జ్యోతి, గృహిణి



కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వాటిని మాలాంటి సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది. ఏ కూరగాయల ధరలు చూసినా కిలో ధర 100కు తక్కువగా లేదు. రూ.500 తీసుకొని మార్కెట్‌కు వెళితే సంచి కూడా నిండటం లేదు. మధ్య తరగతి, పేద వర్గాలు పావు కిలో కూరగాయలతోనే సరిపెట్టుకుంటున్నారు. అది సరిపోని పరిస్థితుల్లో చింతపండు రసంతో చారు కాచుకునే పరిస్థితి ఉంది.

జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 22: జిల్లాను అన్నిరంగాల్లో ముందు ఉంచడంతోపాటు ప్రజాసంక్షేమం, జిల్లాఅభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాశాఖల అధికారులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులకు అన్నివసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు అన్నివసతులు కల్పిస్తున్నామన్నారు. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజాసంక్షేమం, ఆరోగ్యం దిశగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకచర్యలు చేపడతామని, ఇందులో భాగంగా 1-19 పిల్లలకు నులి పురుగుల మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో వైద్యసేవలు అందిం చేందుకు ప్రత్యేకశిబిరాలు నిర్వహిస్తామన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి తడి పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాంభట్, జిల్లాసంక్షేమాధికారి భాస్కర్, డీఈవో అశోక్, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో భిక్షపతి, స్వచ్ఛందసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారు..

వాంకిడి: కష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత ఫలితాలను సాధిస్తారని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించిన వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి దుర్గం అర్జున్‌ను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన అర్జున్‌కు పైచదువుల నిమిత్తం కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. విద్యార్థి ఉన్నతస్థాయిలోకి రావాలని ఆశీర్వదిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్ల పట్టివేత

ఆసిఫాబాద్, జూన్ 22: జిల్లాకేంద్రంతోపాటు కాగజ్‌నగర్, రెబ్బెన ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలను, ట్రాక్టర్లను శనివారం జిల్లా మైనింగ్ ఏడీఈ ఎస్ గంగాధర్‌రావు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. రెబ్బెనలో అక్రమంగా ఇసుక, మెటల్ డస్టును తరలిస్తున్న రెండు లారీలను, ఆసిఫాబాద్‌లో రెండు ట్రాక్టర్లు, కాగజ్‌నగర్‌లో ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని ఐదు వాహనాలకు లక్ష రూపాయిల జరిమానా విధించారు.


పట్టుకున్న లారీతో మైనింగ్ ఏడీఈ గంగాధర్

తొలకరి చినుకు.. ఆరుద్ర మెరుపు


బొంబాయిగూడలో కనిపించిన ఆరుద్ర పురుగులు

పెంచికలపేట, జూన్ 22: ఆరుద్రకార్తె పేరు వినగానే మొదటగా గుర్తొచ్చేది ఆరుద్ర పురుగులే. కార్తె మొదటి రోజు అయిన శనివారమే ఈ పురుగులు మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో కనిపించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి జల్లులు కురవగానే నల్లని నేలపై ఎర్రని వర్ణంలో ఆరుద్ర పురుగులు పుడమికి ఎర్రని తిలకం దిద్దినట్టు కనిపిస్తాయి. ఆరుద్ర పురుగులు కనిపంచాయంటే వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు పండుతాయని రైతుల నమ్మకం.

తిర్యాణి అడవులను జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తాం

● జువాలజికల్ డైరెక్టర్ మంజూష మహాజన్

తిర్యాణి, జూన్ 22: తిర్యాణి అడవులను జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తామని జువాలజికల్ డైరెక్టర్ మంజుష మహాజన్ అన్నారు. శనివారం మండలంలోని గిన్నెధరిరేంజ్ పరిధిలోగల చింతల్ మాదర అటవీప్రాంతాన్ని కవ్వాల్ టైగర్ రిజర్వు ఐఎఫ్‌ఎస్ శాంతారాం, సీనియర్ జువాలజిస్ట్ చక్రవర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంగిడిమాదర బీట్ నెంబర్ 110లో గల అతిప్రాచీనమైన కర్ర అవశేష శిలాజాలను, నత్త అవశేషశిలాజాలను ఎప్పుడు ఏర్పడి ఉంటాయని, వాటి వయస్సెంత ఉంటుందనే అంశాన్ని పరిశీలించారు. అటవీప్రాంత అందాలను, ఇక్కడున్న పరిస్థితులను గమనించి వారు దీనిని జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


అడవులను పరిశీలిస్తున్న జువాలజికల్ డైరెక్టర్ మంజూష మహాజన్



వేతనాలు వెంటనే విడుదల చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 22: శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్లకు వెంటనే రెండు నెలల వేతనాలు విడుదల చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఓసీపీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ప్రతినెల 7న వేతనాలు ఇవ్వాలని సర్క్యులర్ ఉన్నా దానిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. సరైన సమయానికి వేతనాలు ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సతీష్, రాజేశం, సురేష్, కుమార్, రవీందర్, సాగర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

గనులను సింగరేణికే అప్పగించాలి

శ్రీరాంపూర్, జూన్ 22: తెలంగాణ ప్రాంతంలో తవ్విన బొగ్గు గనులను సింగరేణికే అప్పగించాలని, వేలం వేయవద్దని బీఎంఎస్ నాయకులు హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య మాట్లాడుతూ సంస్థకు రావాల్సిన బకాయిలను విద్యుత్ సంస్థల నుంచి ఇప్పించాలని కోరారు. ఇతర సమస్యలను మంత్రి వద్ద ప్రస్తావించగా, ఆయన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, నాయకులు నాతాడి శ్రీధర్ రెడ్డి, రాగం రాజేందర్ పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో హాజరు శాతం పెంచాలి

శ్రీరాంపూర్, జూన్ 22: భూగర్భ గనుల్లో హాజరుశాతం పెంచాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. సమావేశమందిరంలో శనివారం ఎస్ఆర్పీ1,3 గనులకు చెందిన గైర్హాజరు కార్మికులకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరవుతున్న కార్మికులు తమ కుటుంబాల గురించి ఆలోచించుకొని, విధులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి : సీఎండీ

శ్రీరాంపూర్, జూన్ 22 : సింగరేణి విద్యా సంస్థల్లో వందశాతం ఫలితాలు సాధించాలని సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రామగుండం-2 ఏరియాలోని సెక్టార్-3పాఠశాలలో త్వరలో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. సింగరేణి నిర్వహిస్తున్న 9పాఠశాలలు, జూనియర్ కళాశాల, డిగ్రీకళాశాల, పీజీకళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. గతేడాది పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించిన సెక్టార్-3, భూపాలపల్లి పాఠశాలల నిర్వాహకులను అభినందించారు. మిగిలిన పాఠశాలలు సైతం వారి బాటలో నడవాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పని చేసి ఉత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సింగరేణి విద్యాసంస్థల్లో 7500మంది విద్యను అభ్యసిస్తున్నారని, గతేడాది 94శాతం ఫలితాలు సాధించినట్లు జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్ వివరించారు. సమావేశంలో డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్స్) ఎస్‌వికె శ్రీనివాస్, జీఎం(కోఆర్డినేషన్) జి. దేవేందర్, జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: జీఎం


డిపెండెంట్లకు కారుణ్య నియామకపత్రాలు అందజేస్తున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, జూన్ 22: నూతనంగా ఉద్యోగాల్లో చేరుతున్న వారు సింగరేణి సంస్థ మనుగడ, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్వాడిలేషన్ కింద 24మంది డిపెండెంట్లకు కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటి వరకు 1830 మందికిపైగా ఉద్యోగాల్లో చేరారని తెలిపారు. అర్హతలతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐటీయూసీ బ్రాంచ్‌సెక్రటరీ దాగం మల్లేష్, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు ఫైడీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణివ్యాప్తంగా ఆందోళనలు

శ్రీరాంపూర్, జూన్ 22 : సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు వేదిక కన్వీనర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని తాము నిరసిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న కొత్తగూడెంలోని పివికె-5గనిపై, 28న భూపాలపల్లిలోని కెటికె-5గనిపై, 29న శ్రీరాంపూర్‌లోని ఆర్‌కె-7గనిపై, వచ్చేనెల1న గోదావరిఖనిలోని జిడికె-11లో గేట్ మీటింగ్, అదేనెల 3న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రశ్న పత్రాన్ని తెలుగుతోపాటు ఇంగ్లీష్‌లో ఇవ్వాలి

రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్, జూన్ 22: ఈనెల30న నిర్వహించే ఈపీ ఆపరేటర్ ఇంటర్నేషనల్ రిటన్‌టెస్టు ప్రశ్నాపత్రాన్ని తెలుగుతోపాటు ఇంగ్లీష్‌లో కూడా ఇవ్వాలని మందమర్రి బ్రాంచి హెచ్ఎంఎస్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, సీఎస్పీ పిట్‌సెక్రెటరీ చొప్పరి రామస్వామి, శ్రీరాంపూర్‌లో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా కార్యదర్శి వి అనిల్‌రెడ్డి వేర్వేరు ప్రకటనలో కోరారు. ముఖ్యంగా ఇప్పటి జనరేషన్ అంతా ఇంగ్లీష్ మీడియం చదివిన దృష్ట్యా వారికి తెలుగు ప్రశ్నాపత్రం అర్థం కావడానికి కొంతసమయం వృధా అవుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రశ్నాపత్రాన్ని ఇంగ్లీష్‌లో ఇవ్వాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 22: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో డీజీఎంగా పనిచేస్తూ ఆర్‌జీ-1 ఏరియా ఇంజనీర్‌గా వెళ్తున్న డీవీ రావును ఏరియా జీఎం బి సంజీవరెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇందారం ఓసీపీ పీఓ ఎం. శ్రీనివాస్, ఏజెంట్లు పాల్గొన్నారు.